www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 5 డిసెంబర్ 2022



తిరుమల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి

10వేల మంది వీధిన పడాల్సిందేనా..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పదేళ్లలోపు సర్వీసు ఉన్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఇంటికి పంపించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు గత నెల 25న అన్ని ప్రభుత్వ శాఖలకు ఉత్తర్వులు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 10,700మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు వీధిన పడనున్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో ఆందోళన మొదలయ్యింది. 'సమాన పనికి సమాన వేతనం' ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న జగన్ ప్రభుత్వం ఉన్నట్లుండి వారిని తొలగించాలని రహస్య జీవో తీసుకురావడంపై రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 40వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలయ్యింది. తమ భవిష్యత్ ఏంటి? అంటూ చర్చించుకోవడం గమనార్హం. ఒరిస్సా, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ఎన్నికల హామీల్లో భాగంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. ఆ రాష్ట్రాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తుంటే, మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంపై కార్మికులు నిప్పులు చెరుగుతున్నారు. బాధితుల్లో ఎక్కువమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లు, స్వీపర్లు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

జీవోను వెనక్కి తీసుకోవాలి

కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ కార్మికుని తొలగించబోమని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కింద పనిచేస్తున్న అందరినీ పర్మినెంట్‌చేస్తామని శ్రీకాకుళంలో పాదయాత్ర ముగింపు సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేర్చకపోగా సంక్షేమ పథకాలకు నిధుల కోసం వివిధ ప్రభుత్వ శాఖల్లో పదేళ్లలోపు సర్వీసున్న వారిని తొలగిస్తామని జగన్‌ప్రభుత్వం జీవో తీసుకురావడం అత్యంత బాధాకరం. వెంటనే ఈ జీవోను వెనక్కి తీసుకోవాలి. లేదంటే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

ప్రభుత్వ రహస్య జీవోపై 'ఔట్‌సోర్సింగ్'లో ఆందోళన

రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం : చినబాబు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అధికారంలోకి వచ్చే ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేసే అందరిని పర్మినెంట్‌చేస్తామని చెప్పారు. ఇపుడు రహస్య జీవో తెచ్చి పదేళ్లలోపు సర్వీసు ఉన్న వారిని తొలగిస్తామని చెప్పారు. ఇది దారుణం. ఐదారేళ్లలోపు పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు లక్షల్లో ఉన్నారు. ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్‌పోస్టులు భర్తీ చేయకపోగా, ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాన్ని ఊడగొడతామని చెప్పడం హేయమైన చర్య. రాష్ట్రవ్యాప్తంగా రెగ్యులర్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఎక్కువ జీతాలిస్తున్నా వద్దనుకుని, డబుల్ డిగ్రీలు, పీజీలు చేసి ప్రభుత్వం ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తుందన్న ఆశతో బతుకు జీవనం సాగిస్తున్నాం. వెంటనే ఈ జీవోను వెనక్కి తీసుకోవాలి. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం.

ఇది దుర్మార్గ చర్య : ఎస్.జయచంద్ర, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

జగన్ ప్రభుత్వం తీసుకున్న దుర్మార్గ చర్య ఇది. లక్షలాది మంది నిరుద్యోగులను శాశ్వత ఉద్యోగులను చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 50వేలకు పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇంటికి పంపిస్తామని జీవో తీసుకురావడాన్ని రాష్ట్ర కమిటి తీవ్రంగా ఖండిస్తోంది. అఖిలపక్షం, ప్రజాసంఘాలతో కలిపి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం. వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలి.

ఎన్నో బాధలు పడ్డా ఆశతో ఉన్నాం : సి.అమర్నాథ్, హౌసింగ్ ఎఇ

చాలా కష్టపడి, ఎన్నో ఇబ్బందులు పడి పనిచేస్తున్నాం. ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారనే ఆశ ఉండేది. మేం లేకపోతే ఏ ఫైల్ కదిలే పరిస్థితి లేదు. ఈ నిర్ణయం చాలా బాధాకరం. ఏజ్‌బార్ వాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్లకి న్యాయం చేయాలి. హౌసింగ్‌లో 2006లో ఎక్కువమంది జాయిన్ అయ్యారు. 2008-09లో, 2015లో ఆ తరువాత చాలా తక్కువమంది జాయిన్ అయ్యారు. న్యూ బిటెక్ స్టూడెంట్స్ ఉన్నారు. అర్ధాంతరంగా ఎవరినీ తొలగించరాదు. హౌసింగ్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో దాదాపు 220 మంది ఉంటారు. ప్రభుత్వ జీవో అమలైతే సగం మంది రోడ్డున పడాల్సిందే.

ఇదే రోడ్డులో రాష్ట్రపతి పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

గుంతల గతుకుల మార్గంలోనే 'ముర్ము' ప్రయాణం

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చాక రోడ్లు అత్యంత దారుణంగా ఉన్న విషయాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతిపక్షాలు సైతం విమర్శిస్తూనే ఉన్నాయి. ఆ విమర్శను పట్టించుకోకపోగా కనీసం 'అతిథులు' వచ్చేటప్పుడు వాటిని పట్టించుకోని పరిస్థితి. చాలా మంది వివిఐపిలు ఆంధ్రా రోడ్లలో వెళ్లలేం అని బహిరంగంగానే ప్రకటించారు. దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము 'జగన్ రహదారి'లో ఇబ్బంది పడక తప్పదు. రాష్ట్రపతి వస్తున్నారని తెలిసి జగన్ ప్రభుత్వం ఆమె వెళ్లే రహదారిని సైతం మరమ్మతు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రంలో విశాఖ, విజయవాడలలో పర్యటించి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి రాష్ట్రపతి చేరుకున్నారు. రాత్రిపూట హెలికాప్టర్ ల్యాండ్ కానున్న నేపథ్యంలో ఎస్‌పిజి వారికి వేరే మార్గం తప్పలేదు. తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి గాజులమండ్యం, తిరుచానూరు, బైపాస్‌రోడ్డు మీదుగా తిరుపతి పద్మావతి అతిథిగృహం చేరుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్వాగతం పలకనున్నారు. శ్రీవారిని దర్శించుకుని సోమవారం మహిళా యూనివర్సిటీలో సదస్సులో పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అక్కడనుంచి అదే గతుకుల రోడ్డులో రాష్ట్రపతి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుగు ప్రయాణం అవుతారు. వెటర్నరీ యూనివర్సిటీ నుంచి హెలిపాడ్ ఏర్పాటు చేసి రేణిగుంట విమానాశ్రయం వద్దకు తీసుకురావాలని అనుకున్నారు. అయితే ఎస్‌పిజి వాళ్లు ఈ రోడ్డు మార్గమే సరైనదని చెప్పడంతో అదే గతుకుల మార్గంలో సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.

ఇంటెలిజెన్స్‌తో ఎర్రచందనం స్మగ్లింగ్ మూలాలు

ఎస్‌ఇబి డైరెక్టర్ ఏ.రవిశంకర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం స్మగ్లింగ్ మూలాల కోసం ఇంటలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలని ఎస్‌ఈబీ డైరెక్టర్ (టాస్క్ ఫోర్స్), ఏడీజీపీ (శాంతిభద్రతలు) ఏ.రవిశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు టాస్క్ ఫోర్సు ఎస్పీ చక్రవర్తి స్వాగతం పలికారు. తరువాత ఆయన టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్, పరిపాలనా కార్యాలయం, ఆవరణలోని పలు ప్రదేశాలను సందర్శించారు. అక్కడ నుంచి కాన్ఫరెన్సు హాలులో అధికారులతో సమావేశమయ్యారు. టాస్క్ ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటలిజెన్స్ విభాగాలను ఉపయోగించడం ద్వారా స్మగ్లింగ్ మూలాలను తెలుసుకోవచ్చునని అన్నారు. పోర్టుల్లో ఏ విధంగా ఎర్రచందనం రవాణా అవుతుందో తెలుసుకునేందుకు పోర్టులను సందర్శించాలని అన్నారు. ఎర్రచందనం డిమాండు ఉన్న చోట నుంచి పరిశోధించాలని తెలిపారు. దీంతో స్మగ్లర్ల రాకను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ చక్రవర్తి మాట్లాడుతూ టాస్క్ ఫోర్సు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల వద్ద చేపడుతున్న తనిఖీలను వివరించారు. బేస్ క్యాంపులు, స్మగ్లర్లను ఏ విధంగా అడ్డుకుంటాన్నారనే విషయాన్ని విశదీకరించారు. ఇంకా కూంబింగ్ ఆపరేషన్ల విధానం గురించి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐలు చంద్రశేఖర్, రామకష్ణ, బాలకష్ణ, ఆర్ఎస్ఐలు, ఎఫ్ఆర్ఓలు, సీసీ పాల్గొన్నారు.

కంటికి రెప్పలా భద్రతా విధులు : డిఐజి

పజాశక్తి - తిరుపతి సిటి, తిరుపతి టౌన్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో 'కంటికి రెప్పలా' భద్రతా ఏర్పాట్లు ఉండాలని అనంతపురం రేంజి డిఐజి రవిప్రకాష్, ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి అన్నారు. యూనివర్సిటీ సెనెట్ హాలులో భద్రతపై అప్రమత్తం చేశారు. రహదారుల్లో ఎలాంటి ఆటంకం లేకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని కార్యాచరణతో విధులు నిర్వహించాలన్నారు. అలాగే క్యుఆర్టి, ఏరియా డామినేషన్ పార్టీ, స్టాటిక్ రోప్ పార్టీలు సభ ప్రాంగణంలోకి ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన పిమ్మటే అనుమతించాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్య ధోరణి అవలంభించరాదన్నారు. రెండు రోజులపాటు కిందిస్థాయి సిబ్బంది నుండి పై స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పర్యటనను విజయవంతం చేయాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్ విడుదల

ఈనెల 4, 5 తేదీలలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా తిరుపతిలో రాష్ట్రపతి పర్యటన ప్రదేశాలను అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఉదయం జేసి డి.కె. బాలాజీతో కలసి కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి పరిశీలించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియం వద్ద ఏర్పాటు కానున్న మహిళా సాధికారిత స్టాల్స్, స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులు, కలంకారి, పుష్ప ప్రసాదం, వేస్ట్ హెల్త్ డెకరేషన్ ఆర్టికల్స్, నాలుగు స్టాళ్లను సందర్శించి ఆడిటోరియంలో నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో హాకీ క్రీడాకారిణి కుమారి రజిని, నాయి బ్రాహ్మణ మహిళ రాధాదేవి, కూచిపూడి నత్య కళాకారిణి దుర్గ , ఆక్వా రంగానికి చెందిన డాక్టర్ శ్రీదేవి , విశ్వవిద్యాలయ విద్యార్థినిలు, ప్రొఫెసర్లు పాల్గొననున్నారని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ పర్యటనలో ఆర్డీఓ కనక నరసా రెడ్డి, డిఆర్డీఏ పి డి, జ్యోతి, మెప్మా పిడి రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలివ్వాలి

తిరుపతి జిల్లా మహాసభలో వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - నాయుడుపేట

ఎండనకా, వాననకా, కరోనా సమయంలోనూ ఆశా వర్కర్ల సేవలు అనిర్వచనీయమని, అందరి సంక్షేమం కోసం పాటు పడుతున్న వారికి కనీస వేతనం రూ.26వేలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర అన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ తిరుపతి జిల్లా మొదటి మహాసభ కిష్టమ్మ అధ్యక్షతన నాయుడుపేటలోని సుందర రామిరెడ్డి భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులపై మోడీ ప్రభుత్వంలో దాడులు అధికమయ్యాయని, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా కార్మికులంతా ఐక్యంగా ఉద్యోగ భద్రతకు పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ వ్యవస్థలో ఆశా కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయడం వల్ల ప్రజలు ఆరోగ్యపరంగా చైతన్యవంతంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకుండా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎంపికయ్యింది.

అధ్యక్ష కార్యదర్శులుగా నాగలక్ష్మి, కిష్టమ్మ

అధ్యక్ష కార్యదర్శులుగా నాగలక్ష్మి, కిష్టమ్మ, ఉపాధ్యక్షులుగా ఉష, జ్యోతి, కోశాధికారిగా మారెమ్మ ఎన్నికయ్యారు. 17 మందితో నూతన కమిటి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్, సిఐటియు నాయకులు శివకవి, ముకుంద, చాపల వెంకటేశ్వర్లు, మహేష్, గౌస్‌బాష, రమేష్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కార్మిక హక్కులను కాపాడుకునేందుకు రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. తిరుపతి ఎంబి భవన్‌లో సిఐటియు తిరుపతి నగర ఏడో మహాసభ ఆదివారం జరిగింది. మెడికల్ రిప్రజెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ చెమటోడ్చి కార్మికులు దేశ సంపదను కాపాడుతుంటే మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అమ్మేస్తూ దేశ సంపదను కొల్లగొడుతోందన్నారు. సమాన పనికి సమాన వేతనం కోసం భవిష్యత్ మొత్తం కార్మిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల పట్ల చాలా కర్కసంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గ నాయకులు పైన, కార్మికుల పైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ కార్మిక ఉద్యమాలను అణచివేయడం కోసం తీవ్రస్థాయిలో దాడి చేస్తుందన్నారు. ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తిరుపతి నగరంలోని యావత్ కార్మిక వర్గం అందరూ ఒక తాటిపై కొచ్చి పోరాడాలని, పోరాటాల ద్వారానే మన హక్కులు సాధించుకోగలమని తెలియజేశారు. అసంఘటిత రంగంలో పనిచేసేటువంటి బిల్డింగ్, ఆటో ,హమాలీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు టి. సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మి ,నగర ఆఫీస్ బేరర్స్ కె వేణుగోపాల్ ,పి. బుజ్జి, జి చిన్న బాబు, రామకష్ణ ,పి చిన్న , భాస్కర్ మరియు 16 రంగాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి : కల్నల్

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థులు జాతీయ భావాన్ని, స్నేహ తత్వాన్ని, సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ప్రకాష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని పరిసర ప్రాంతాలను విగ్రహాలను ఎన్‌సిసి క్యాడెట్ల ఆదివారం పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్ సి సి విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ డెవలప్మెంట్ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, పరిరక్షణ, జాతీయ, దేశ నాయకుల విగ్రహాల పరిశు భ్రత కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ వి సిబ్బంది, ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

'అక్కాబావలపై అక్కస్సొద్దు కొడుకా..!'

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

'రాజకీయంగా ఎదుగుతున్న మీ అక్కా బావలపై అక్కసు పెంచుకోవద్దు' అని సామాను వెంకట నారాయణరెడ్డి తన కొడుకు శ్రీధర్ రెడ్డికి హితబోధ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మసూధన్ రెడ్డికి మామ, శ్రీవాణీ, శ్రీధర్ రెడ్డిలకు తండ్రైన సామాను వెంకటనారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో మీడియానుద్దేశించి మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి గతాన్ని తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. బతుకుదెరువు చూపించిన అక్కా బావలపై అక్కసు వెళ్లగక్కడం మంచిది కాదని హితవు పలికారు. తండ్రి ఆస్తిలో కొడుకు, కుమార్తెకు సమాన హక్కు ఉంటుందన్న విషయాన్ని ఎలా మర్చిపోయావంటూ ప్రశ్నించారు. ఆస్తికోసం బెదిరింపులకు దిగడం, ఆత్మహత్య డ్రామాలు ఆడడం మానుకోవాలని సూచించారు. టిడిపి నాయకుడైన నీ మామతో కలిసి నా అల్లుడు మధుసూదన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తే సహించబోనని హెచ్చరించారు.

7న ఉపాధ్యాయ సంఘాల ధర్నా

తిరుపతి టౌన్ : ఈనెల ఏడవ తేదీన విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్‌టియు ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తిరుపతి జిల్లాలో కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు తాళ్ళూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల.నాగేశ్వర రావు, సీనియర్ నాయకులు ధనుంజయ నాయుడు, జగన్నాథం, జిల్లా ఆర్థిక కార్యదర్శి. మునికష్ణమ నాయుడు, కృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

గొడుగుచింత గోవిందయ్యకు జ్యోతి రావు పూలే పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి చిత్తూరు పట్టణంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో 'తెలుగుభాషకు గ్రహణం వీడేదెన్నడు' అనే అంశముపై సదస్సు జరిగింది. సాహితీవేత్తలకు మహాత్మా జ్యోతిరావు పూలే విశిష్ట పురస్కారాలు అందచేశారు. ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత తెలుగు భాషో పాధ్యాయులు, గొడుగుచింత గోవిందయ్యకు ముఖ్యఅతిధుల చేతుల మీదుగా మహాత్మా జ్యోతి రావు పూలే పురస్కారం అందచేశారు. కవులు మర్రి పూడి దేవేంద్ర రావు, నారాయణస్వామి, నూకతోటి రాజేష్ పాల్గొన్నారు.

ఈ ఉద్యోగాలు మాకొద్దు బాబోయ్..!!

ఎండీయూవోలపై పని 'భారం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఇంటి గుమ్మం వద్దకే రేషన్ డెలివరీ" విధానం పెనంలోంచి పొయ్యిలోకి పడ్డ చందంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఎండీయూవో(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్లు) కొందరు పని ఒత్తిడి, ఖర్చులు భరించ లేక రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు ఇప్పటికే రాజీనామాలు చేసి ఇంటికి పరిమితమయ్యారు. ప్రభుత్వం చెప్పిందొకటి..!! మా చేత చేయిస్తోందొకటంటూ" ఆపరేటర్లు మండిపడుతున్నారు. డ్రైవర్లు మేమే..!! హమాలీలు మేమేనా..!! అంటూ విస్తుపోతున్నారు. ఈ జాబ్‌లు మాకొద్దు బాబోయ్..అంటూ దండం పెడుతుండటం గమనార్హం.

ఎండీయూవోలపై పని, ఖర్చు భారం

ఇంటి వద్దకే రేషన్ డెలివరీ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం గతేడాది జనవరిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పౌరసరఫరా వ్యవస్థలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు లబ్ధిదారులకు నేరుగా సన్నబియ్యంను అందించడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. అందుకోసం ఓ వాహనాన్నీ, దాని నడిపేందుకు ఆపరేటర్లను ఏర్పాటు చేసింది. ఆపరేటర్లుగా చేరే వారికి రూ.10 వేలు వేతనంగానూ చెల్లిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 336 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా క్షేత్ర స్థాయిలోకెళ్లేసరికి ఆపరేటర్ల పరిస్థితి గందరగోళంగా ఉంటోంది. ప్రభుత్వం ఇస్తున్న జీతం, అలవెన్సులు ఏ మాత్రం సరిపోవడం లేదనీ, సహాయకులకివ్వగా మిగిలేదీ మాకు గుండు సున్నానేనని వాపోతున్నారు. ఎండీయూవోలుగా పనిచేస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.26 వేలను వారి ఖాతాల్లో జమచేస్తోంది. ఇందులో వాహనం ఈఎంఐకు రూ.8 వేలు, ఇంధనానికి రూ.3 వేలు, సహాయకుడికి రూ.5 వేలు పోగా మిగిలుతోంది రూ.10 వేలు. అయితే కొన్ని ఎండీయూవోలకు 1200 నుంచి 3 వేల కార్డులు ఉండటంతో పని భారం పెరుగుతోంది. దాంతో సహాయకులు వారికిస్తున్న వేతనాన్ని రెట్టింపు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేషన్ దుకాణాల వద్ద సరుకులు నింపుకునే క్రమంలో సహాయకులకు సాయం చేయలేని ఆపరేటర్లను తమ పూర్తి స్థాయి వేతనాన్ని సహాయకులకే ఖర్చు చేస్తున్నట్లు వాపోతున్నారు. అసలు ప్రభుత్వం తమను డ్రైవర్లుగానే పనిచేయమని చెప్పిందనీ, వలంటీరు, హెల్పర్ డోర్ డెలివరీకి సాయపడాతరని పేర్కొందనీ, అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడ జరుగుతోందంటూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణం వద్ద సరుకులు నింపుకుంది మొదలు లబ్ధిదారులకు వాటిని చేర్చే వరకు అన్నీ తామే చూసుకుంటున్నామనీ, సచివాలయ సిబ్బంది గానీ, వలంటీర్ గానీ కన్నెత్తి కూడా చూడటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- **భర్తీ కానీ ఖాళీలు**

డోర్ డెలివరీ వాహన ఆపరేటర్లపై పని, ఖర్చు భారం పెరిగిపోతుండంతో రాజీనామాలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ జాబ్‌లు మాకొద్దంటూ మొత్తుకుంటున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాల్టీ పరిధిలో ఇద్దరు, రూరల్ మండలంలో ఇద్దరు ఆపరేటర్లు రాజీనామాలు చేయడం ఇందుకు నిదర్శనం. తొట్టంబేడు మండలంలో ఒకరు రాజీనామా చేయగా అతికష్టం మీద అధికారులు ఆపరేటర్ను భర్తీ చేశారు. అయితే శ్రీకాళహస్తి అర్బన్, రూరల్ మండలంలో నిలిచిపోయిన ఆపరేటర్ల స్థానాలను ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్నా భర్తీ చేయకపోవడం గమనార్హం. నోటిఫికేషన్ తరహాలో కాకుండా నేరుగానైనా భర్తీ చేస్తామంటూ అభ్యర్థిస్తున్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితి. దీంతో ఏం చేయాలో తోచక అధికారులు తల పట్టుకుంటున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 28, 29, 30, 31వ వార్డుల్లో ఆర్నెళ్లుగా మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలు రాకపోవడంతో అక్కడి ప్రజలు దూరంలో ఉన్న రేషన్ దుకాణాలకెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- **పని ఒకటే..ఖర్చులు అధికం**

మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లతో పాటు రేషన్ డీలర్ల వ్యవస్థను ప్రభుత్వం సమాంతరంగా నడిపిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. " పని ఒకటే..ఖర్చులు మూడు" అన్న చందాన చౌక సరుకుల సరఫరా విధానం ఉందని విమర్శలు వస్తున్నాయి. స్టాక్ పాయింట్‌గా ఓ దుకాణం, స్టాకిస్టుగా ఓ డీలర్, సరుకులను తీసుకెళ్లేందుకు వాహనం, దాన్ని నడిపేందుకు ఆపరేటర్, సరుకులు డోర్ డెలివరీ చేసేందుకు ఓ సహాయకుడు..! ఇవన్నీ అదనపు ఖర్చు కాదా అని ఎండీయూవోలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. కొత్త ఉద్యోగం మోజులో కష్టపడి పనిచేస్తున్నా, తమకంటే రేషన్ డీలర్లే అధికంగా సంపాదిస్తున్నారనీ, వారికొచ్చే కమీషన్ మాకంటే ఎక్కువగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇలా అయితే ఎండీయూవోలుగా పనిచేయడం కష్టమనీ, ప్రభుత్వం మేల్కొని పౌరసరఫరాల వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

నేరుగానైనా భర్తీ చేస్తాం:జరీనా, తహశీల్దార్

శ్రీకాళహస్తి అర్బన్, రూరల్ మండలంలో నలుగురు ఎండీయూవోలు రాజీనామా చేశారు. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. నోటిఫికేషన్ ద్వారా కాకుండా నేరుగానైనా భర్తీ చేసేందుకు చొరవ తీసుకుంటున్నాం. అయినా లాభం లేకుండా పోతోంది. యువకులు ముందుకు రావడం లేదు. అయినా ప్రయత్నించి త్వరలోనే భర్తీ చేస్తాం.

శ్రీవారి సేవలో ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి దర్శించు కున్నారు..ఆదివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆలయం వెలుపల కొందరు మీడియా ప్రతినిధులు అమర రాజా బ్యాటరీస్ కంపెనీ ఈ రాష్ట్రం నుంచి తరలిపోతుందని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని ప్రశ్నించారు. దీనికి అమర రాజా కంపెనీ తరలింపు విషయం చెప్ప కుండా ఉప ముఖ్యమంత్రి పొంతన లేని సమాధానాలు చెప్పుతూ తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై ధ్వజ మెత్తారు. ఈ రాష్ట్రం నుంచి ఏ కంపెనీలు తరలిపోలేదని చెప్పారు..

నేర చరిత్ర ఉన్న వ్యక్తులను..

ధర్మకర్తల మండలిలో తీసుకోకూడదు

భాజపా నేత భానుప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: ఆధ్యాత్మిక చింతన ఉన్న వ్యక్తులను మాత్రమే తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా తీసుకోవాలని, ప్రస్తుతం ధర్మకర్తల మండలి సభ్యుడిగా రాజీనామా చేసిన లక్ష్మినారాయణ వ్యవహారం యావత్తు శ్రీవారి భక్తులను కల వరపరిచిందని భాజపా నేత భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయం వద్ద ఆయన మాట్లా డారు.. టిటిడి నిబంధనలకు విరుద్ధంగా 81 మంది ధర్మకర్తల మండలి సభ్యులను నియమించినప్పుడే తాను హై కోర్టును ఆశ్రయించా నన్నారు..ప్రస్తుతం పాలక మండలి సభ్యులల్లో చాలా మందికి నేర చరిత్ర కలిగి ఉన్నరన్నారు..టిటిడి తీసుకొని వచ్చిన దర్శన మార్పువల్ల సామాన్య భక్తులకు మేలు జరుగు తుందని, ఈ విధానం ఇలాగే కొనసాగించాలని టిటిడిను ఆయన కోరారు..

నగరపాలక అధికారులారా పట్టించుకోండి

4 నెలలుగా మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్లు

మరమ్మతుకు గురైన మూత్ర విసర్జన శాల, బేసిన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని గోవిందధామం వద్ద ప్రయాణికులు, స్థానికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు గత నాలుగు నెలలుగా మరమ్మతులకు గురయ్యాయని, మరుగుదొడ్లను బాగు చేయించి వాడుకులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. గోవిందధామంకు కర్మ క్రియలకు, దహన సంస్కారాలకు వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్న మరుగుదొడ్లు మరమ్మతుకు గురవడంతో ఇక్కడకు వచ్చేవారు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ మరుగుదొడ్లు నిర్వహణ చేస్తున్న మహిళపై ఇటీవల నీటి ట్యాంక్ పడబోయిందని, తృటిలో తప్పించుకున్నానని ప్రజాశక్తితో తెలిపారు. అసౌకర్యాన్ని గమనించి నగరపాలక సంస్థ అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం: డాక్టర్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : నడకతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వాకర్స్ బిల్డింగ్‌లో అధ్యక్షులు మురుగారెడ్డి, గోపీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ కోవిడ్ వచ్చి వెళ్లిన వాళ్లకు వచ్చు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం 5గంటకు లేచి వాకింగ్ చేయాలన్నారు. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ షుగర్ అదుపులో ఉంటే మామూలు మనిషి కన్నా ఎక్కువ కాలం హాయిగా బతకచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్ రెడ్డి, కే కుప్పయ్య శెట్టి, ద్వారకనాథ శెట్టి, రామచంద్ర నాయుడు, వెంకటేశ్వర నాయుడు, రామ్మోహన్ వర్మ, యుగంధర్ రాజు, రఘునాథ రెడ్డి, రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

'రెడ్' సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు : రెడ్ సంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. శనివారం రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్డ్(రెడ్ సంస్థ) ఆధ్వర్యంలో గూడూరు మాజీ శాసనసభ్యులు చేతుల మీదుగా ఓజిలి మండలం పెదపరియ గ్రామానికి చెందిన మాత్తయ్య అనే దివ్యంగునికి ఒక ట్రైసైకిల్, ఫల సరుకులను సనిశెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకర్థం వారి కుమారులు వంశీ కృష్ణ, సాయి కృష్ణ చైతన్యలు దాతృత్వంతో అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, రాజ్ పురోహిత్ రాజేష్, టి.రామలింగం, శ్రీనివాస ఆచారి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మౌలికసదుపాయాలకు నిధులు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావుగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అప్పుడు చెన్నూరు గ్రామానికి చెందిన ముస్లింలు

పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందులో భాగంగానే ఆదివారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు గూడూరు పట్టణానికి చెందిన వైసీపీ మైనార్టీ నేత, తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ఛైర్మన్ సయ్యద్ అబ్దుల్ గఫూర్‌కు ఫోన్ చేసి చెన్నూరు గ్రామానికి వెళ్లి ముస్లింల సమస్యలు తెలుసుకొని రావాలనీ ఆదేశాలు ఇచ్చారు. వెంటనే సయ్యద్ అబ్దుల్ గఫూర్ చెన్నూరు గ్రామానికి చేరుకొని మదీనా మసీదులో కమిటీ నుండి వినతిపత్రం స్వీకరించారు.ముస్లింలు ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలను గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు,వక్ఫ్ బోర్డు స్టేట్ ఛైర్మన్ షేక్ ఖాదర్ బాషా, తిరుపతి ఛైర్మన్ సిరాజ్‌ల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే నిధులువిడుదల చేయించి ముస్లింల సమస్యలు పరిష్కరిస్తాం అని తెలిపారు. కొరపటి రవీంద్ర బాబు, సయ్యద్ నాయబ్ రసూల్, షేక్ అహ్మద్, చెన్నూరు హుస్సేన్ బాషా, ఖాదర్ బాషా ఉన్నారు.

విహంగాలకు విడిదిల్లు నేలపట్టు...

- పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి
- అబ్బురపరుస్తున్న దృశ్యాలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఆదివారం వస్తే చాలు దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి మొదలవుతుంది. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెల నుంచి ప్రారంభంపై ఏప్రిల్ వరకు పక్షుల సీజన్ ముగిస్తుంది. అక్టోబర్‌లో విదేశాల నుంచి వలస పక్షులు నేలపట్టు పక్షుల కేంద్రంలో విడిది చేరి గూళ్లు కట్టి సంతాన ఉత్పత్తి జరిపి పిల్లలతో సహ ఏప్రిల్ నెల నాటికి తిరిగి వాటి దేశాలకు పిల్లలతో సహ వెళ్లిపోతాయి. విదేశీ వలస పక్షులు ఎన్నో వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి నేలపట్టులో విడిది చేయడంతో వాటిని వీక్షించేందుకు పర్యాటకులు ప్రతిరోజు వందల సంఖ్యలో నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించి పక్షులను వీక్షిస్తూ ఉంటారు. ఆదివారం రోజు మాత్రం వేలసంఖ్యలో పర్యాటకుల కేంద్రాన్ని సందర్శించి విదేశీ విహంగాలను వీక్షిస్తారు. విహంగాలు వినిపించే కేరింతలు, చెరువులోని చాపలు వేటాడే విధానాన్ని పర్యాటకులు చూస్తూ ఆనందంగా కేరింతల కొడుతూ ఉంటారు. వీటితోపాటు పిల్లలకు చిల్డ్రన్స్ పార్క్, జింకల పార్క్ మొదలైనవి ఉంటాయి. వాటిలో పిల్లలు ఆడుతూ పాడుతూ కేరింతలు కొడుతూ ఉంటారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫారెస్ట్ అధికారులు వారికి సహాయ సహకారాలు అందిస్తూ చెరువు కట్టపై పక్షులను వీక్షించే సమయంలో పర్యాటకులకు బైనస్కోప్ లాంటివి ఇచ్చి విహంగాల గురించి పర్యాటకులకు తెలియజేస్తూ ఉంటారు. ఇక్కడ పక్షులు పర్యాటకులను అబ్బుర పరుస్తుంటాయి.

పూడిలో ఆగని మట్టి మాఫియా

అడ్డుపడినా ఆగని వైనం
గగ్గోలు పెడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -తొట్టంబేడు తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామ పరిసర ప్రాంతాల నుంచి మట్టిని నిత్యం తరలిస్తూ ఉన్నారు. ఓవైపు గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఆజ్ఞాపిస్తున్నా, అడ్డుకుంటున్నా మట్టి అక్రమ రవాణా దారులు లెక్క చేయడం లేదు. దీని ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయమై స్థానిక సచివాలయ మహిళా పోలీస్‌కు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని కనీసం ఫోన్ కూడా ఎత్తి సమాధానం చెప్పడం లేదని గ్రామస్తులు బాధ పడుతున్నారు. మట్టి అక్రమ రవాణా చేసే వ్యక్తులు మహిళా పోలీస్ గ్రామా నికి సంబంధించిన వ్యక్తులేనని, అందుకే ఆమె పట్టనట్లు వ్యవహరి స్తుందన్న ఆరోపణలు గ్రామంలో వినపడుతున్నాయి. ట్రాక్టర్లు గ్రామం నడి బొడ్డున వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోని భయ భ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలకు ఆనుకునే ఈ వాహనాలు వెళుతూ ఉంటాయి. విద్యార్థులు రోడ్డు దాటుకునేటప్పుడు భయపడుతూ దాటాల్సిన పరిస్థితి నెలకొంటుంది అన్నారు. అతివేగంతో ఈ ట్రాక్టర్లు గ్రామంలో సవారి కొడుతూ వెళ తున్నాయని, ఇటుక బట్టి వ్యాపార స్తులకు కనీసం చలనం కూడా లేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసినా మట్టిదందా ఆగకపోవడం పంచాయతీ ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఎటు వంటి అనుమతి లేకుండా మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు నిమ్మక నీరెత్తినట్లు ఉండడంలో ఆంతర్యం ఏమి అని పలువురు చర్చించు కుంటున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టి అక్రమ రవాణా అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమం గా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ సుధీర్ రెడ్డి అన్నారు. మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సెటిల్మెంట్ భూములైనా సరే పరిమిషన్ తీసుకోకుండా మట్టిని తరలించ కూడదన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

సీనియర్ మాస్టర్ లక్ష్మీకాంతమ్మ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: త్రినేత్ర పిరమిడ్ ధ్యానంతో మంచి ఆరోగ్యాన్ని జ్ఞాపకశక్తిని పొందువచ్చని తాడిపత్రి సీనియర్ మాస్టర్ లక్ష్మీకాంతమ్మ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక త్రినేత్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, జయ చంద్రన్, గిరి వర్మ, సుకన్య, మల్లేశ్వరి, పురుషోత్తం శెట్టి, జ్ఞాన విద్యార్థి ప్రాజెక్టు కోఆర్డి నేటర్ డి.నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానానికి లక్ష విరాళం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి తిరుమలకు చెందిన రాజేశ్వరి ఆదివారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేసి అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

ఎంజీఎం వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎంజీఎం ఆస్పత్రి, కోకాకోలా పరిశ్రమ ఆధ్వర్యంలో ఆదివారం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ చైతన్య, ఎముకల వైద్య నిపుణుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గమళ్ళలపాలెంలోని మెప్మా, మునిసిపాలిటీ సౌజన్యంతో మై బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి నిర్వహణలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. రోటేరియన్ శివకుమార్ దాతగా వ్యవహ రించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, సీనియర్ రోటేరియన్లు బి.దశరధరామ రెడ్డి, పి.వి. కృష్ణయ్య, మయూరి శ్యామ్ యాదవ్, యస్.వి.జి.ప్రసాద్, రాంప్రసాద్, పి.వి.మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘనే

ఆచార్య సీతా కుమారి

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళలపై హింస భౌతిక దాడులు మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తాయని న్యాయవిభాగం మాజీ విభాగాధిపతి ఆచార్య సీతాకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న '16 డేస్ యాక్టివిజం'లో భాగంగా ఆదివారం మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన విభాగం, కేంద్రం ఆధ్వర్యంలో " జెండర్ బేస్డ్ వయలెన్స్ - ఎ హ్యూమన్ రైట్స్ ఇష్యు " అనే అంశం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండర్ బేస్డ్ వైలెన్స్ గ్లోబల్ సమస్యగా పేర్కొన్నారు. సోషలైజేషన్ ప్రాసెస్‌లో మార్పురానిదే అనేక రకాల లింగ అసమానతలను రూపు మాపడం కష్టం అన్నారు. చట్టాల పై అవగాహన పెంచు కోవాలని, పురుషులలో చైతన్యం కలిగించాలని సూచించారు. డాక్టర్ హైమావతి, ఉమాదేవి, రాణి, చైతన్య, ప్రభ, ప్రీతి, సుచరిత, భువనేశ్వరి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొలగేదెన్నడో..

పార్టీ వ్యవస్థాపకుడికి ఇదేం ఖర్మ అంటున్న ప్రజలు

ముసుగుతో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా వ్యాపింపజేసిన నందమూరి తారక రామారావు విగ్రహానికి ముసుగు తొలుగే దెప్పుడోనని అటు టిడిపి సానుభూతిపరులతో పాటుగా ప్రజలు ప్రధాన ప్రతిపక్షంపై విమర్శలు చేస్తున్నారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఎగువపాలెం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేశారు. తిరుపతి నగరంలో కురిసే వర్షపు నీరును లోతట్టు ప్రాంతాలకు పంపేందుకు నగర పాలక సంస్థ తుఫాను కాలువను లీలా మహల్ నుండి తిమ్మి నాయుడు పాలెం వరకు నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో తుఫాను కాలువ నిర్మాణానికి ఎన్టీఆర్ విగ్రహం అడ్డు రావడంతో విగ్రహాన్ని తొలగించి పక్కన పెట్టారు. విగ్రహ తొలగింపు ప్రక్రియలో ఎన్టీఆర్ ఎడమ చేయి మణికట్టు వరకు విరిగిపోయింది. అటు తరువాత తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు రావడంతో ఎన్టీఆర్ విగ్రహానికి అధికారులు ముసుగు ధరింపజేశారు. నేటికీ ఆ ముసుగుతో, విరిగిన చెయ్యితో ఎన్టీఆర్ విగ్రహం అలానే ఉంది. విగ్రహం చుట్టూ చెట్లు పెరిగిపోతున్నాయి. ఇదంతా చూస్తున్న ఎన్టీఆర్ అభిమానులు, ప్రయాణికులు, ప్రజలు ప్రధాన ప్రతిపక్షం టిడిపి నాయకుల తీరును తప్పుపడుతున్నారు. పార్టీ వ్యవస్థాపకునికి ఇంతటి ఖర్మ పట్టిందని, ఇకనైనా తిరుపతి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి సముచిత స్థానం కల్పించాలని, విగ్రహాన్ని బాగు చేయాలని కోరుతున్నారు.

గత మూడేళ్లుగా రజకులపై పెరిగిన దాడులు

ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

రామారావును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మూడు సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా రజకులపై దాడులు జరుగుతున్నాయని, అయినా రజకులు రాజకీయంగా చైతన్యవంతులు అవుతున్నారని శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ పరిధిలో రజకుల 10వ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చట్టసభల్లో గళమెత్తానన్నారు. టిడిపి హయాంలో రజకులకు సముచిత స్థానం కల్పించి కార్పొరేషన్ ద్వారా 45 వేల కోట్లు ఖర్చు చేసి రజకుల ఉన్నతికి కృషి చేశామన్నారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ ఆధ్వర్యంలో రజకులు ఆర్థికంగా ఎదగాలని నగర పరిధిలో 7 దోబిగాట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆహ్వాన కమిటీ ఛైర్మన్ గంధం బాబు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు స్థానాలు కల్పించిన ఘనత టిడిపిదేనన్నారు. సంత్ ఘాట్ కే బాబా జయంతిని పురస్కరించుకుని సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన 45 మందికి ఘాడ్కే బాబా పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ తుడా ఛైర్మన్ నరసింహాయాదవ్, కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ, చినబాబు, దంపూరు భాస్కర్ యాదవ్, కరాటే చంద్ర, మునిశేఖర్ రాయల్, సిపాయి సుబ్రమణ్యం, మహేష్, ఆముదాల తులసిరామ్, మనోహరాచారి, శ్రీరాములు, రాజయ్య, సురేష్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఎటుచూసినా సమస్యలే...

- పారిశుధ్య లోపం...
- పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో గాడితప్పిన పాలన
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఇన్‌ఛార్జి అధికారుల పాలనలోనూ పంచాయతీల్లో అభివృద్ధి కానరావడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. ఆరు నెలలుగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో డ్రైనేజీల్లో పూడికలు, వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. అంటు రోగాలు వ్యాపిస్తాయని మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చెత్త అక్కడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ అనేక కార్య క్రమాలు చేపడుతున్న విషయం మనకు తెలిసిందే. అదే విధంగా పెద్దపల్లి జిల్లా స్వచ్ఛతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం జిల్లాకు అవార్డు ప్రకటించిన విషయం విదితమే. జిల్లాలో పారిశుధ్యం ఎలా ఉందో పక్కన పెడితే రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా సెప్టెంబర్ 5 నుంచి సెప్టెంబర్ 11 వరకు గురుకుల పాఠశాలలో పకడ్బందీగా ప్రత్యేక పారిశుధ్య కార్యాచరణను చేపట్టాలని ఆదేశించింది.

అధికారులు నిర్లక్ష్యం : గ్రామాల్లో పరిసరాలను పారిశుద్ధ్యం లోపిస్తున్నా, పట్టించుకున్న పాపాన పోయిన అధికారులు గానీ, నాయకులు గానీ లేరు. ప్రతినిత్యం కాలువల్లో పారే మురుగు నీరు పైనుండి అధి కారులు పం చాయతీ సిబ్బంది కానీ సమస్యను పరిష్క రించాలనే ధ్యాసలే కపోవడం విచారకారం గ్రామా లు పరిశుభ్రత పట్ల ఏమాత్రం పట్టింపు ఉందో ఇట్లే తెలుస్తుంది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించే మార్గాలను అన్వేషించకుండా కాలయాపన చేయడం అనేక విమర్శలకు తావిస్తుంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడు తుంది. ఇప్పటికైనా వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలక ముందే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేప ట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి -పిచ్చాటూరు: సోమవారం పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి పిచ్చాటూరులో పర్యటించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్ర రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు అరణియార్ ప్రాజెక్టు గేట్లు వద్దకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేరుకొని జలాశయంలో 10 లక్షలు చేప పిల్లలు వదిలే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తదుపరి సాయంత్రం 3 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని రీసర్వే పూర్తి చేసిన రజానగరం, అప్పంబట్టు గ్రామ రైతులకు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మత్స్యకార సంఘ నేతలు, సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రూ.1.75 లక్షలతో తాగునీటి మోటర్ ప్రారంభం

తాగునీటి మోటార్లను ప్రారంభిస్తున్న మంత్రి అన్న రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: నింద్ర మండలం అగరంపేట గ్రామ ప్రజల చిరకాలం కోరిక మేరకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. రూ.1.75లక్షలతో మోటారు బిగించి స్టార్టర్‌ను స్విచ్ ఆన్ చేసి మంత్రి ఆర్కే రోజా అన్న రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. సచివాలయంలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం లో గుర్తించిన పనుల్లో భాగంగా గ్రామ ప్రజల చిరకాలం కోరిక మేరకు తాగునీటి సమస్య పరిష్కారం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఇంకా ఏదైనా సమస్యలు ఉన్న వెంటనే సచివాలయ కార్యదర్శులకు తెలియజేస్తే వెంటనే అధికారులతో చర్చించి మంత్రి ఆర్కేరోజా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. నింద్ర మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్లు ప్రజాప్రతినిధులు వైసీపీ శ్యామ్‌లాల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

కల్నల్ ప్రకాష్ కుమార్

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు జాతీయ భావాన్ని, స్నేహతత్వాన్ని, సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ప్రకాష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని పరిసర ప్రాంతాలను, విగ్రహాలను ఎన్‌సిసి క్యాడెట్లు ఆదివారం పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్‌సిసి విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ డెవలప్మెంట్ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, పరిరక్షణ, జాతీయ, దేశ నాయకుల విగ్రహాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ వి సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సులకు పుష్కల అవకాశాలు

అంబేద్కర్ ఓపెన్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భీమన్న

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్యా కోర్సులలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని స్థానిక ఆర్ట్స్ కళాశాల అంబేద్కర్ ఓపెన్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భీమన్న పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటై నలభై సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్టడీ సెంటర్లలో నలభై సంవత్సరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని ఎస్.వి.ఆర్ట్స్ కాలేజ్ స్టడీ సెంటర్లో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ప్రస్తుతం ఎస్.వి.ఆర్ట్స్ కాలేజ్ లో ఎకనమిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు. అంబేద్కర్ర్ ఓపెన్ యూనివర్సిటీ ముఖ్య ఉద్దేశ్యాలను వెల్లడించారు. అంతేకాకుండా ఈ దూరవిద్య మహిళలకు, చదువుకు దూరమై మళ్ళీ చదువుకోవాలనే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు.

విద్యుత్ అంతరాయం సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పంచాయతీలో విద్యుత్ అంతరాయం సమస్యను పరిష్కరించాలని స్థానిక టిడిపి నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సప్తగిరి కాలనీకి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా పంచాయతీలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సప్తగిరి కాలనీ పంచాయతీలో తరచూ విద్యుత్ అంతరాయం జరుగుతోందని స్థానిక ప్రజలు తెలిపారన్నారు. పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి రెడ్డి, శీను, మధుశేఖర్, మహేశ్వరి, హేమలత, జడారెడ్డి భాస్కర్ రెడ్డి, అల్లా భాష, గూళ్ళురూ మణి, రవి, బాలకృష్ణ, సుబ్బు యాదవ్, హరికృష్ణ, గోపి, శంకర, రామ్మూర్తి, నారాయణ, నాగభూషణం, ప్రసాద్, రమేష్, షాహిదా, ఈశ్వరి, జానకి రామయ్య, బాపుప్రకాష్ పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ బాబోయి: మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్

చిల్లకూరు: 'ఇదేమి ఖర్మ బాబోయి' అంటూ మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదివారం సర్వే జరిపి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కార నిమిత్తం ఓటు విలువ గుర్తుంచుకోవాలన్నారు. ఓటే ప్రధాన ఆయుధమని హెచ్చరించారు. ఆదివారం ఆయన మండలంలోని నాంచారం పేట గ్రామంలో సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబీకులతో చంద్రబాబు నాయుడు పాలన కాలంలోని నిత్యావసర సరుకుల ధరలను గురించి వివరిస్తూ, ప్రస్తుతం ఉన్న ధరలు అధికంగా ఎంత శాతానికి పెరిగిపోయినాయో రెండింటి మధ్య ధరలను వివరించారు. రాబోయే ఎలక్షన్లో పవిత్రమైన ఓటును స్వేచ్ఛగా ఉపయోగించుకొని టిడిపికి ఓట్లేసి అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట, టిడిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, కడివేలు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు మహిళా సంఘం నాయకురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : 8-119, రాయల్ నగర్, ఆర్.సి. రోడ్డు, తిరుపతి.
- ఆర్.కె. కాంప్లెక్స్, సి.వి.ఆర్.ఎం. డిగ్రీ కాలేజి ఎదురు, లాంగ్‌బజార్, వెంకటగిరికోట.
- ఫస్ట్‌ఫ్లోర్, డిఆర్‌సి కాంప్లెక్స్,ఆర్‌ఆర్ స్ట్రీట్, మదనపల్లి.
- ఫస్ట్‌ఫ్లోర్, బజార్‌స్ట్రీట్,న్యూపేట్, రామ్మూర్తి స్వీట్‌షాప్ ఎదురు, పలమనేరు.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 3465.15 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798